క్లుప్తంగా

చిత్తూరులో జోరు వాన

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం, మండల ప్రాంతాల్లో గురువారం జోరువాన కురిసింది. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన వర్షం , ఏకదాటిగా సాయంత్రం 4 గంటల వరకు కురుస్తూనే ఉంది. రోడ్లు, కాలువలు జలమయంగా మారాయి. అయితే రెండు రోజులుగా ఎండలు తారెత్తించాయి. సూర్యుడు సుర్రుమన్నాడు. రోడ్లమీద తిరిగే జనం విలవిల్లాడిపోయారు. అయితే గురువారం కురిసిన వర్షంతో నగరవాసులకు ఉపశమనం లభించింది. వాతావరణం పూర్తిగా చల్లబడింది.

ఏనుగు తరలింపుతో కరెంట్ కట్

గుడిపాల: ఒంటరి ఏనుగు తరలింపు నేపథ్యంలో గుడిపాలలో కరెంట్ కట్ చేశారు. 197 రామాపురం నుంచి ఈచర్ వ్యాన్‌లో ఒంటరి ఏనుగును తీసుకువెళుతున్న సందర్భంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ తీగలపై తొండంతో దాడి చేస్తుందన్న సందేహంతో అటవీశాఖ అధికారుల సూచనల మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ కరీముల్లా తెలియజేశారు. రాత్రి 8గంటల నుంచి 10:30 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేశారు.

ఇన్‌చార్జి ఏపీఓగా సంధ్యారాణి



పూతలపట్టు: మండల ఇన్‌చార్జి ఏపీఓగా సంధ్యారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏపీఓగా విధులు నిర్వర్తిస్తున్న సౌభాగ్యవతి బదిలీ కావడంతో కొన్ని రోజులు జూనియర్ ఇంజినీర్ ఈశ్వరమ్మ విధులు నిర్వర్తించారు. అనంతరం పూతలపట్టు ఇన్‌చార్జి ఏపీఓగా సంధ్యారాణిని, డ్వామా పీడీ గంగాభవాని ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఐరాల మండలంలో ఏపీఓగా, పూతలపట్టు ఇన్‌చార్జి ఏపీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆవుల దొంగలు అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

శ్రీరంగరాజపురం: ఆవులను దొంగలించిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ షేక్షవాలి అన్నారు. చిన్నతయ్యూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం. ఈనెల 22న అర్ధరాత్రి పిచ్చాటూరు మండలం రామగిరి గ్రామానికి చెందిన మునివేలు(31), పార్థసారథి(41) ఇద్దరు సుబ్రమణ్యం ఇంటి ఆవరణలోని పాడిఆవును వాహనంలో తీసుకెళ్లారు. సుబ్రమణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా దర్యాప్తు చేసి నిందితులను రామగిరిలో పట్టుకున్నారు. ఆవును యజమాని సుబ్రమణ్యంకు అప్పగించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

7న గోకులాష్టమి

తిరుపతి రూరల్: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో ఈ నెల 7న గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. టీటీడీ హిందువుల ముఖ్యమైన పండుగల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. ఇందులో భాగంగా శ్రీకృష్ణ గోలోకాన్ని తలపించే విధంగా టీటీడీ శ్రీవేంకటేశ్వర గోశాలలో ఏర్పాట్లు చేయనుంది. ఈ ఏడాది సందర్శకులు గోశాలలో గోమాతలకు బెల్లం, బియ్యం స్వయంగా తినిపించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. గోకులాష్టమి సందర్భంగా ఎస్వీ గోసంరక్షణశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామికి అభిషేకం, వేణుగానం, వేద పఠనం, కళాకారులతో భజనలు, కోలాటాలు నిర్వహిస్తారు.

దేశమ్మ హుండీ ఆదాయం రూ. 6.53 లక్షలు

నగరి: దేశమ్మ హుండీ ఆదాయం రూ.6.53లక్షలు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. టీఆర్ కండ్రిగలోని దేశమ్మ ఆలయ 49 రోజుల హుండీ కానుకలను గురువారం లెక్కించారు. లెక్కింపులో రూ.6, 53 లక్షల నగదు కానుకలుగా వచ్చాయన్నారు. చిత్తూరు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఏకాంబరం ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో ఈఓ కే.రామచంద్రారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ధర్మకర్తలు షేడు, బాబు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి

యాదమరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలోనే సంక్షేమ పాలన సాగుతోందని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. ఆయన పూతలపట్టు నియోజకవర్గంలోని యాదమరి మండలంలో గురువారం 12 కమ్మపల్లె పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని జెడ్పీ వైస్ చైర్మన్‌తో కలసి నిర్వహించారు. ప్రతి గడపలో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి కాగానే నెరవేర్చారని గుర్తుచేశారు. మరోసారి జగనన్నను సీఎం చేస్తే రాష్ట్రంలో సంక్షేమ పాలన దిగ్విజయంగా కొనసాగుతుందని చెప్పారు. ప్రజలు కొందరు ఇళ్లు లేవని, మురుగునీటి కాలువలు లేవని, సీసీ రోడ్లు నిర్మించలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నప్పటికీ ఎందుకు లబ్ధిదారులకు అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ప్రభుత్వ పథకాలు అర్హులకు అందకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండలంలోని 12 కమ్మపల్లె పంచాయతీ గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, సర్పంచ్ కోటీశ్వరన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మనోహరన్, నాయకులు పరంధామ గౌడ్, కార్తిక్ రెడ్డి, గజేంద్రయాదవ్, సురేష్, శేఖర్ పాల్గొన్నారు.

అందరు ఏకమైనా గెలుపు జగనన్నదే

చంద్రబాబు నాయుడు విపక్షాలను ఏకం చేసినా గెలుపు జగనన్నదేనని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. ఆయన యాదమరిలో గురువారం మీడియాతో మాట్లాడుతూ, కేంద్రంలో చంద్రబాబును కలవకూడదని బీజేపీ పెద్దలు చెప్పడంతో చంద్రబాబు ఆందోళనలో మునిగిపోయారని చెప్పారు. ఇదే సమయంలో ఢిల్లీలో ఎన్టీఆర్ నాణెం విడుదలకు ముందుగానే వెళ్లిపోయి బీజేపీ మంత్రులతో రహస్యంగా మాట్లాడి, దత్త పుత్రుడితో కలసి 2024 ఎన్నికల్లో కలసి వచ్చేందుకు పావులు కదుపుతున్నారన్నారు. కానీ రాష్ట్రంలో జగనన్న అన్ని వర్గాలకు పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందించారని, అందరు జగనన్నకు ఓటు వేసి, రుణం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అవ్వా ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి ఎవరు?



జగనన్న ఫొటోను చూపిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: 12 కమ్మపల్లె ముస్లింవాడలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ప్రతి గడపకు వెళ్తున్న సమయంలో 90 ఏళ్ల వృద్ధురాలు వద్దకు వెళ్లారు. ''అవ్వా బాగున్నావా..ఈ ఫొటోలో ఉన్న వ్యక్తిని గుర్తుపడతావా.'' అని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అడగ్గానే ఎందుకు గుర్తుపట్టను నాయనా జగన్‌బాబు కదా అనగానే అక్కడ ఉన్నవారందరూ ఆశ్చర్యపోయారు. ఆ బాబు వల్ల మేము ప్రతి నెలా 1వ తేదీన పింఛన్ తీసుకుంటున్నాము. ఆ బాబు చల్లగా ఉండాలంటూ దీవించింది.

నేడు పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో శుక్రవారం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వేకువజాము నుంచి పంపిణీ ప్రారంభం కాగా వలంటీర్లు ఇంటింటా పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. ఐదు రోజుల్లోపు లబ్ధిదారులు వలంటీర్లకు అందుబాటులో ఉండి పింఛన్ పొందాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ త్యాగరాజులు

తవణంపల్లి: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తెలిపారు. మండలంలోని అరగొండ, తవణంపల్లె పాఠశాలల సీఆర్‌సీలలో ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల బోధనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు బోధనలో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో హేమలత, రిసోర్స్ పర్సన్‌లు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవని నగర కమిషనర్ అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను హెచ్చరించారు. ఆమె నగరంలోని 22వ వార్డులో గురువారం ఆకస్మికంగా పర్యటించారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును తనిఖీ చేశారు. తేనెబండ ప్రధాన వీధి, మహాత్మానగర్, ముత్యాలమ్మ వీధి, కెనరా బ్యాంక్ వీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని యజమానులకు నోటీసులు ఇవ్వాలని సిబ్బందికి ఆదేశించారు. వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కొబ్బరి చిప్పలను పూర్తిస్థాయిలో తొలగించి డంపింగ్ యార్డ్ తరలించాలని చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీలు శుభ్రంగా ఉంచాలన్నారు. ప్లాస్టిక్ వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. సమయపాలన పాటించాలని, హాజరు నమోదు పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు



హోమంలో పాల్గొన్న పైమాఘం సురేంద్రరెడ్డి

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. చందనాలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో స్వామికి సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు. రాత్రి ప్రాకారోత్సవం ఘనంగా నిర్వహించారు.

మండల అభివృద్ధికి కలసికట్టుగా కృషి

బంగారుపాళెం: మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో గురువారం 3.15 గంటలకు ఎంపీపీ అమరావతి అధ్యక్షతన మండల సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. అజెండాలోని అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభ్యున్నతికి అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం కల్పించనున్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలన్నారు. గ్రామాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైస్‌ఎంపీపీలు శిరీష్‌రెడ్డి, జయకుమార్, జెడ్పీటీసీ సోమశేఖర్, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ అనీల్‌కుమార్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ సర్పంచ్ హైడ్రామా..

సమావేశంలో అజండాలోని అంశాలపై సమావేశంలో చర్చిస్తుండగా 170 గొల్లపల్లె టీడీపీ సర్పంచ్ కోకా ప్రకాష్‌నాయుడు చిరిగిన దుస్తులు ధరించి భిక్షగాడు అవతారమెత్తి సర్వసభ సమావేశానికి వచ్చారు. పంచాయతీలకు అందాల్సిన నిధులు దారి మళ్లించారంటూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేశారు. అయితే అక్కడే ఉన్న సీఐ నాగరాజరావు, సిబ్బంది కలిసి ప్రకాష్‌నాయుడును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్ వద్ద కాసేపు ఉన్న ప్రకాష్‌నాయుడు హఠాత్తుగా కళ్లు తిరిగిపడిపోయారు. వెంటనే పోలీసులు చిత్తూరు ఆస్పత్రికి తరలించారు. టీడీపీ నాయకులు అప్పటికే పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆందోళన కారులతో చర్చించి, శాంతింపచేశారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయభాస్కర్

పూతలపట్టు: ప్రజలందరూ పౌరహక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని తహసీల్దార్ విజయభాస్కర్ పిలుపునిచ్చారు. ఆయన గురువారం మండలంలోని గువ్వలకాలనీలో గ్రామస్తులకు హక్కులపై అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎంపీడీఓ గౌరి మాట్లాడుతూ కాలనీలో చిన్నపిల్లలందరూ బడిలోనే ఉండాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల కోసం కొన్ని వేల కోట్లు ఖర్చుపెట్టి ప్రభుత్వ బడుల్లో సకల సౌకర్యాలను అందిస్తోందన్నారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడులను రూపుదిద్దుతున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థికి సంవత్సరానికి అమ్మఒడి పథకంతో తల్లుల ఖాతాలో రూ.13 వేలు జమ చేస్తోందన్నారు. గోరుముద్దతో రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మా భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు

- అధికారుల అండదండలతోనే కబ్జా
- రెవెన్యూతీరుపై వృద్ధురాలి ఆవేదన



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు గంగాబాయి, చెన్నమ్మ

పూతలపట్టు: మా భూమిని మాకు ఇప్పించాలంటూ యం.బండపల్లికి చెందిన టి.గంగాబాయి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ సొంత భూమిని బంధువులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. గ్రామానికి చెందిన లేట్ రాఘవప్ప తన కుమార్తె గంగాబాయికి పసుపు కుంకుమ కానుకగా తనకున్న సర్వేనెంబరు 852-ఏ లోని 25 అడుగుల వెడల్పు 40 అడుగుల పొడవు రెండు గదుల ఇంటిని, కొంత ఆస్తిని రాసిచ్చారు. రాఘవప్ప చనిపోయిన వెంటనే కుమారుడు కుబేంద్రన్ తన తల్లి చెన్నమ్మను, గంగాబాయిని ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. అప్పటి నుండి గంగాబాయి, తన తల్లి చెన్నమ్మతో కలిసి చిత్తూరులో నివసిస్తోంది. కుబేంద్రన్ డాక్యుమెంటుకు విరుద్ధంగా గంగాబాయికి రాసిచ్చిన ఇంటిని, ఖాళీ జాగాను కబ్జాచేసుకొని అక్కడ కొత్త భవనం నిర్మిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత రెవెన్యూ అధికారులకు బాధితులు పలుమార్లు అర్జీలిచ్చినా పట్టించుకోలేదని వాపోయారు. పైగా రెవెన్యూ అధికారుల సమక్షంలోనే కుబేంద్రన్ దౌర్జన్యాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతడి నుంచి తమకు ప్రాణహాని ఉందని తెలిపారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం కారణంగా మా భూమి ఆక్రమణకు గురైందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని విలేకర్ల సమావేశంలో మొరపెట్టుకున్నారు.

రాత్రి వేళ బయట తిరగరాదు

యాదమరి: మండల పరిధిలోని అటవీ ప్రాంతాలకు ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి వేళ బయట తిరగొద్దని తహసీల్దార్ హనుమంతు సూచించారు. గుడిపాల మండలం, తమిళనాడు సరిహద్దులో ఒంటరి ఏనుగు ముగ్గురి ప్రాణాలు తీసిందని, ఆ ఒంటరి ఏనుగు యాదమరి మండలం మీదుగా వెళ్లిందని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలో అటవీప్రాంతాలు ఆనుకొని ఉన్న భూమిరెడ్డిపల్లె, పట్రపల్లె, మాదిరెడ్డిపల్లె, గొందివాళ్లవూరు. తాళ్లమడుగు, కీనాటంపల్లె, రాచూరు గ్రామీణ ప్రజలు సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు పంట పొలాల వైపు వెళ్లరాదని సూచించారు. ఈ విషయాన్ని గ్రామీణ ప్రజలు గుర్తించాలన్నారు.

అనుబంధానికి ప్రతీక

శ్రీరంగరాజపురం: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని రాష్ట్ర మహిళ నాయకురాలు కృపాలక్ష్మి అన్నారు. కృపాలక్ష్మి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు రాఖీలూ కట్టి, మిఠాయిలు పంచారు. నాయకులందరికీ ఆమె రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉడమలకుర్తి సర్పంచ్ చిట్టిమహేష్‌కు రాఖీ కట్టి, స్వీట్ తినిపించారు.

108లో ఆడబిడ్డ ప్రసవం



ప్రసవించిన బిడ్డతో 108 సిబ్బంది

చిత్తూరు రూరల్: గర్భిణికి 108 అంబులెన్స్ సిబ్బంది సుఖ ప్రసవం చేయడంతో గురువారం ఆడబిడ్డ జన్మించింది. చిత్తూరు మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన ప్రియదర్శినికి పురిటినొప్పులు అధికం కావడంతో కుటుంబీకులు ఉదయం 5.15 గంటలకు 108ను సంప్రదించారు. 5.35 గంటలకు అంబులెన్స్ గ్రామానికి చేరుకుంది. ఆమెను చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, నొప్పులు అధికమయ్యాయి. వెంటనే ఈఎంటీ అనుసూయ, పైలెట్ డి లోకేష్ స్పందించి ప్రసవం చేశారు. దీంతో ఆ తల్లి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ,బిడ్డ సురక్షితం ఉన్నారని, చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు.

శ్రీరామ్ చిట్స్‌కు 'ఫోరం' అక్షింతలు

చిత్తూరు అర్బన్: వినియోగదారుడికి చిట్ నగదు ఇవ్వడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన శ్రీరామ్ చిట్స్ సంస్థకు జిల్లా వినియోగదారుల కమిషన్ (ఫోరం) అక్షింతలు వేసింది. వినియోగదారుడు నాగరాజుకు రూ.30 వేల నగదుతోపాటు అదనంగా రూ.12 వేలు చెల్లించాలని చిత్తూరులోని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు అనిత, సభ్యులు సలీమ్, కోమల గురువారం తీర్పునిచ్చారు. రామకుప్పానికి చెందిన నాగరాజు పలమనేరులోని శ్రీరామ్ చిట్స్‌లో రూ.2లక్షల విలువైన చిట్ గ్రూప్‌లో 2014 జూన్‌లో చేరాడు. సక్రమంగా కంతులు చెల్లిస్తూ 2015 మార్చిలో చిట్‌ను పాడుకోగా.. రూ.1.30 లక్షలు వచ్చింది. రూ.లక్ష ఇచ్చిన శ్రీరామ్ నిర్వాహకులు, రూ.30 వేలను ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. దీంతో బాధితుడు ఫోరంను ఆశ్రయించాడు. వినియోగదారుడికి సకాలంలో చిట్ నగదు ఇవ్వకపోవడాన్ని ఫోరం తప్పుపట్టింది. నాగరాజుకు రూ.30 వేల నగదును ఏటా 9 శాతం వడ్డీతో ఇవ్వాలని, ఆయనపడ్డ మానసిక వేదనకు రూ. 8వేలు, కోర్టు ఖర్చులకు రూ.4 వేలను ఎనిమిది వారాల్లో చెల్లించాలని ఫోరం తీర్పునిచ్చింది.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంకుడుగుంతలకు అదనంగా రూ.6 వేలు కేటాయిస్తుందని తెలిపారు. వాటి వివరాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు వివరంగా తెలియజేయాలని సూచించారు. అనంతరం ఉపాధి పనుల్లో కూలీలకు కేటాయించిన వారపు లక్ష్యాలను పూర్తిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఇన్‌చార్జి ఏపీఓ సంధ్యారాణి, జూనియర్ ఇంజనీరింగ్ ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. మునిసిపల్ కార్యాలయంలో గురువారం మేయర్ ఎస్.అముద అధ్యక్షతన జరిగిన సమావేశానికి కమిషనర్ డాక్టర్ అరుణ హాజరయ్యారు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో భాగంగా అజెండా అంశాలపై చర్చించారు. కార్పొరేషన్‌లో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తూ మరణించిన నలుగురికి రూ.2లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి ఆమోదించారు. నాగయ్య కళాక్షేత్రంలో సెంట్రలైజ్డ్ ఏసీ ఏర్పాటు చేయడానికి అవసరమైన నిధులను సాధారణ నిధులను వ్యయం చేయాలని నిర్ణయించారు. గంగినేని చెరువు సమీపంలో ఖాళీ స్థలంలో ఉద్యానవనాన్ని అభివృద్ధి చేసి, పిల్లల ఆట వస్తువులు, బెంచీలు ఏర్పాటు చేయడానికి తయారుచేసిన అంచనాలను సాధారణ నిధుల నుంచి వ్యయం చేయడానికి ఆమోదించారు. కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి మురళీకృష్ణను ఆయన మాతృశాఖకు సరెండర్ చేయడానికి, ఇతర అజెండా అంశాలపైన చర్చించి ఆమోదించారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, జిఆర్ శ్రీకాంత్, సి.శోభ, బి.పూర్ణచంద్రరావు, సహదేవన్, మునిసిపల్ ఇంజినీరు వెంకట ప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, సీఎంఎం గోపి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ పథకాల వెలుగులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, వేదికపై మేయర్ అముద, కమిషనర్ అరుణ

చిత్తూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమం ప్రతి ఇంటి తలుపు తడుతోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక 49వ డివిజన్‌లో చవటపల్లెలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మేయర్ అముదతో కలిసి ఎమ్మెల్యే డివిజన్‌లో పర్యటించారు. అనంతరం సంతపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సభను కార్పొరేటర్ జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు చిత్తూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమం కింద రూ.2,744 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఉదాహరణకు చిత్తూరు నగరంలోని 45వ డివిజన్‌కు రూ.30కోట్లు, 46వ డివిజన్‌కు రూ.28కోట్లు, 47వ డివిజన్‌కు రూ.42.50 కోట్లు, 48వ డివిజన్‌కు రూ.39 కోట్లు, 49వ డివిజన్‌కు రూ.36 కోట్లు చొప్పున మొత్తం 5 డివిజన్లకు రూ.175.50 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. గత సంవత్సరం మే 11న చిత్తూరు నియోజకవర్గంలో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. చిత్తూరు నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించి ప్రజాసమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రతి సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందన్నారు. అదే విధంగా మరో రూ.50 లక్షలు అదనంగా ఇస్తున్నట్లు ఇటీవల జగనన్న చిత్తూరులో అమూల్ డెయిరీ శంకుస్థాపనకు వచ్చినప్పుడు ప్రకటించారన్నారు. నవరత్న పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏయే సంక్షేమ పథకాలు అందాయి, వాటిద్వారా ఎంత లబ్ధిచేకూరిందో ప్రజలకు తెలియజేశామన్నారు. అర్హత ఉన్నా పథకాలు అందని వారిని గుర్తించి అందజేస్తున్నట్లు మేయర్ అముద, కమిషనర్ అరుణ తెలిపారు. దేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి క్షేత్రస్థాయిలో ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకొనే కార్యక్రమం ఎక్కడా లేదని డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ జ్ఞానజగదీష్ తెలిపారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కార్పొరేటర్లు పూర్ణచంద్ర, రెడ్డెప్ప, హరిణిరెడ్డి, గణేష్, కో-ఆప్షన్ మెంబర్ కోలాకిరణ్, గుడిపాల మండల కన్వీనర్ జనార్దన్, నాయకులు రాజా, త్యాగ, భూపేష్, నారాయణ, అమర, వెంకటేష్, శివ, శిరీష్‌రెడ్డి, హేమనందరెడ్డి, ప్రేమ్, సీతాపతి, అల్తాఫ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి

ఐరాల: మామిడి పంటల కోత అనంతరం చేపట్టే యాజమాన్య పద్ధతులపైనే దిగుబడి ఆధారపడి ఉంటుందని జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వైఎస్ గేటు సమీపంలో ఉన్న కలెక్షన్ సెంటర్‌లో గురువారం మామిడిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మామిడి పంటలో సాగు ఖర్చులు తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. మామిడి పంట కోత అనంతరం 15 నుంచి 20 రోజుల పాటు చెట్టుకు విశ్రాంతి ఇవ్వాలన్నారు. అనంతరం తోటలో అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించి సూర్యరశ్మి నలుమూలలా పడేవిధంగా చూడాలన్నారు. అనంతరం లీటర్ నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మామిడి పంటలో జనుము, జీలుగ, పిల్లి పెసర లాంటి పచ్చిరొట్ట పంటలను పెంచి కలియదున్నాలని చెప్పారు. 10 ఏళ్లు పైబడిన చెట్లకు 100 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల యూరియా, 5 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ ఎరువులను చెట్ల మొదలు నుంచి 3 నుంచి 4 అడుగుల దూరంలో 30 నుంచి 45 సెంటీమీటర్లు గాడి తీసి వేయాలని సూచించారు. మామిడి తోటను వాలుకు అడ్డంగా రెండు సార్లు దున్నితే సరిపోతుందని, ఎక్కువ సార్లు దున్నవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శ్రీరెడ్డిరామ్, ఉద్యాన అధికారి లక్ష్మిప్రసూన పాల్గొన్నారు.